దాహం తీరింది

- కుత్బుల్లాపూర్‌లో నీటి సమస్యకు చెక్
- మిషన్ భగీరథతో రోజూ నీటి సరఫరా

కుత్బుల్లాపూర్: ఒకప్పుడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రాంతం..రెండు మూడు రోజులకోసారి సరఫరా అయ్యే తాగునీరు.. ఒక్కోసారి వారానికి కూడా నీటి సరఫరా చేయని ప్రాంతాలు.. ఏ బస్తీలో చూసినా నీళ్ల కోసం మహిళల కొట్లాటలు సర్వసాధారణంగా కనిపించేవి.. ఇది 2014 ముందు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పరిస్థితి.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తొమ్మిదేళ్ల కాలంలో నీటి సమస్యకు ఫుల్‌స్టాప్ పడింది.. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇవ్వడంతో నేడే నీటి కోసం మహిళలు క్యూలు కట్టాల్సిన ఎక్కడా కనిపించదు.. రోజు విడిచి నీటి సరఫరాలో నియోజకవర్గ ప్రజలు తాగునీటిని పొందుతున్నారు.



మహిళలకు నీటిబిందెను అందజేస్తున్న మంత్రి కేటీఆర్.. చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ (ఫైల్)

గడప గడపకు సురక్షిత తాగునీరు..

సురక్షిత మంచీనీరు ప్రతీ రోజు నిర్విఘ్నంగా ప్రతీ గడపకు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా రూ.759.35 కోట్ల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల దాహార్తిని శాశ్వతంగా పరిష్కారం చూపించారు.

◆ జీహెచ్ఎంసీ పరిధిలో రూ.5.30.18 కోట్ల నిధులతో 5 ఎస్టీపీలు, నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్‌లో రూ.17.55 కోట్లు, ప్రగతి నగర్‌లో రూ. 14.46 కోట్లు, బాచుపల్లి రూ. 48.15, గండిమైసమ్మ రూ.93.46, కొంపల్లి రూ.55.55 కోట్లు మొత్తంగా రూ.759.35 కోట్లతో తాగునీటిపైపు వ్యవస్థను ఆధునీకరించడంతో కొత్త పైపులైన్లను ఏర్పాటు చేశారు.

పెరిగిన నీటి సరఫరా..

గతంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి 60.55 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేయగా నేడు అదనంగా 76.65 ఎంఎల్‌డీలతో కలుపుకుని 137.30 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో నీటి కనెక్షన్లు 58,862 ఉండగా నేడు నీటి సరఫరా కనెక్షన్లు 1,00,166 కు చేరుకున్నాయి. వీటిలో కొత్త కనెక్షన్లు 57,304 ఉన్నాయి. గతంలో 372.38 కి.మీ. మేర నీటి పైపులైన్లు ఉండగా ప్రస్తుతం 845.17 కి.మీ. మేర కొత్త పైప్‌లైన్ వ్యవస్థ ఉంది. గతంలో 41 రిజర్వాయర్లు ఉండగా నేడు 63కు చేరుకున్నాయి.

మిషన్ భగీరథ ద్వారా రిజర్వయర్ల సామర్థ్యం పెంపు..

గతంలో రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 24.35 ఎంఎల్ మాత్రమే ఉండగా గడిచిన ఎనిమిదేళ్ల కాల వ్యవధిలో నూతన రిజర్వాయర్ల ఏర్పాటుతో 63.93 ఎంఎల్‌కు చేరుకుంది. మురికివాడలు, గృహాలు, అపార్ట్‌మెంట్లను కలుపుకుని మొత్తం 80వేల కనెక్షన్‌లు ఉంటే వాటిలో 46,111 ఇళ్లకు జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వం ప్రకటించిన 20 కేఎల్ ఉచిత నీటి సరఫరా పథకాన్ని అమలు పరుస్తున్నారు. నీటి సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.49.27 కోట్ల మేర రాయితీని అందిస్తోంది. అదే విధంగా భూగర్భ జలాలు మెరుగు పరిచేందుకు 105 ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు.

మురుగునీటి శుద్ధీకరణ... మెరుగైన మురుగునీటి వ్యవస్థ..

2014 కు ముందు మురుగునీటి నెట్‌వర్క్ పొడవు 350కిలోమీటర్లు మాత్రమే ఉండగా నేడు మురుగు నీటి నెట్‌వర్క్ 610 కి.మీటర్లకు పెరిగింది. గతంలో మురుగునీటిని శుభ్రపరిచే యంత్రాలు 10 మాత్రమే ఉండగా, ప్రస్తుతం కొత్తగా మరో మూడు యంత్రాలు కొనుగోలు చేయడంతో 13కు చేరుకున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో మ్యాన్యువెల్‌గా మ్యాన్‌హోళ్ల శుభ్రం చేయడానికి పూర్తిగా నిషేధించారు. ప్రస్తుతం జెట్టింగ్ యంత్రాల ద్వారా శుభ్రం చేస్తు ప్రజలకు మురుగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. పని చేసేవి.. నేడు ఆపరేషన్‌లో ఉన్న మురుగునీటి శుభ్రపరిచే యంత్రాలు 13.. అంటే 3 యంత్రాలను పెంచాము. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొత్తం మాన్యువల్ క్లీనింగ్ నిషేధించారు. యాంత్రికంగా జెట్టింగ్ మెషిన్ ల ద్వారా శుభ్రపరచడం జరుగుతుంది. కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో 248.02 కోట్ల నిధులు వెచ్చించి మొత్తం 5 ప్రాంతాల్లో మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీ ప్లాంట్లను నిర్మిస్తున్నారు.

గతంలో తాగునీరు, మురుగునీటి పారుదలకు రూ.58.98 కోట్లు మాత్రమే వెచ్చించడగా 2014 నుండి నేటి వరకు రూ.530.18 కోట్లు వెచ్చించారు. కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్‌ల నుండి కుత్బుల్లాపూర్ ప్రాంతానికి తాగునీరు అందేలా ప్రాజెక్ట్ లు రూపకల్పన చేయడం జరిగింది. తద్వారా 2050 వరకు మంచినీటి శాశ్వత పరిష్కారం లభించనుంది.

క్లుప్తంగా

నిజాంపేట్ టీడీపీ నూతన కార్యవర్గం నియామకం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీడీపీ నూతన కార్యవర్గాన్ని శనివారం టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ప్రకటించారు. అడ్వైజర్‌గా అనుమోల శ్రీనివాస్, కోర్డినేటర్‌గా నాగేష్ ముదిరాజ్, అధ్యక్షుడిగా అనీల్ కరుటూరి, ఉపాధ్యక్షులుగా నందిగామ సత్యనారాయణ, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, దోమ రామారావు, యడ్లపల్లి నాగేశ్వర రావుతదితరులను నియమించారు.

మేయర్‌ను కలిసిన పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు


మేయర్ నీలారెడ్డిని ఆహ్వానిస్తున్న బాచుపల్లి పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు శనివారం మేయర్ నీలా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 19, 20 తేదీలలో రాజీవ్ గాంధీనగర్‌లోని బెరాకా గోస్పెల్ చర్చ్‌లో క్రీస్తు సువార్త ఉజ్జీవ సభలు కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ముఖ్య అతిథులుగా హాజరు కావాలని మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నిజాంపేట్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, బాచుపల్లి పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ అబ్రహం, ట్రెజరర్ జాష్ పాల్, పాస్టర్ శామ్యూల్, పాస్టర్ ఎలీసా తదితరులు ఉన్నారు.

పారిశ్రామిక వాడలో రసాయనాల ఆనవాళ్లు



చింతల్: గాంధీనగర్ పారిశ్రామికవాడలో మళ్లీ రసాయన ఆనవాళ్లు దర్శనమిస్తున్నాయని స్థానిక కాలనీలో ప్రజలు ఆరోపిస్తున్నారు. గాంధీనగర్ పారిశ్రామికవాడ నుండి వెంకటరామిరెడ్డినగర్, గాంధీనగర్, మారుతి నగర్, దుర్గయ్య నగర్‌ల మీదుగా వెళ్లే నాలా గణేష్‌నగర్ నాలాలో కలుస్తున్న విషయం తెలిసింది. 2019లో గాంధీనగర్‌లో ఉన్న వివిన్ లేబరేటరీస్ పాటు కెమికల్ రసాయనాలకు సంబంధించిన పలు కుటీర పరిశ్రమల సైతం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు మూసివేశారు. తాజాగా నాలాలో రాత్రి సమయంలో 7గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు పెద్ద ఎత్తున రసాయనాలు కలిసి పారుతుండడంతో ఘాటైన వాసనలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. గాంధీనగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వెలుస్తున్న అక్రమ రసాయన కెమికల్ కంపెనీలను గుర్తించి మూసివేయాలని పలు బస్తీలు, కాలనీల ప్రజలు కోరుతున్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి


దూదిమెట్ల సోమేశ్‌యాదవ్‌ను సత్కరించిన యాదవ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: అఖిల భారత యాదవ మహా సభ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దుదిమెట్ల సోమేశ్ యాదవ్‌ను గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. శనివారం పాపయ్య యాదవ్‌నగర్‌లోని ఆయన కార్యాలయానికి తరలివచ్చిన యాదవ సంఘం సభ్యులు శాలువతో సత్కరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సోమేశ్‌యాదవ్ మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు వెంకటరావు యాదవ్, తిరుమల రాజు యాదవ్, పూర్ణ యాదవ్ , శ్రీనివాస్ యాదవ్, మాల్యాద్రి యాదవ్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి


భానుచందర్

కుత్బుల్లాపూర్: విధులకు వెళుతున్న పారిశుధ్ధ్య కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. కొంపల్లి గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు పాటురాజు కుమారుడు భానుచందర్(35) కొంపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం తెలవారుజాన విధులకు వస్తుండగా గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు దుఃఖ సంద్రంలో మునిగిపోయారు.

'కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటోంది'


కొంపల్లిలో ప్రచారం చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటోందని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్సారెడ్డి భూపతిరెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్రలో భాగంగా శనివారం ఆయన కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1, 4, 5, 6వ వార్డుల్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్న భూపతిరెడ్డి మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలను గుర్తించి ఆనాడు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని, కానీ నేడు ఆ అమరుల ఆశయాలను, ఆకాంక్షాలను తుంగలో తొక్కి కేసీఆర్ కుటుంబం రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కొంపల్లి మునిసిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్ సరిత శివకుమార్ గౌడ్, మాజీ సింగల్ విండో చైర్మన్ యతి రాజారావు, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, పీఏసీఎస్ డైరెక్టర్ డప్పు నరేందర్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ హాల్‌లో అదనపు అంతస్తు నిర్మించాలి


వార్డు కార్యాలయ ఇంచార్జికి వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

రంగారెడ్డినగర్: గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాలు భవనానికి అదనపు అంతస్తు నిర్మించాలని కోరుతూ స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మినాథ్ ఆధ్వర్యంలో శనివారం వార్డు అడ్మినిస్ట్రేషన్ అధికారి ఉదయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మినాథ్ మాట్లాడుతూ గతంలో కమ్యూనిటీ భవనంలో స్థానిక సమస్యలు చర్చించుకోవడంతో పాటు ఆధార్ నమోదు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు పండుగలు, ఉత్సవాలు జరుపుకునేవారమన్నారు. ప్రస్తుతం కమిటీ హాలులో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో తమకు ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలకు జరుపుకునేందుకు వెసులుబాటు లేకుండా పోయిందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కమిటీ హాలు భవనంపై మరో అంతస్తు నిర్మించి స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

జర్నలిస్టు కుటుంబాలకు వైద్యంలో రాయితీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు 50శాతం రాయితీతో కూడిన వైద్య సదుపాయాలు అందించేందుకు గాను ఆసుపత్రి నిర్వాహకులు సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఆసుపత్రి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కల్నాల్ కమలాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యపరమైన రక్షణ కల్పించాలని కోరామని తెలిపారు. డాక్టర్ కమలాకర్, డాక్టర్ యోబు మాట్లాడుతూ రాందేవ్ రావు ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులో ఉంచామని తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్ కార్డులు, దరఖాస్తులు అందించాలని సూచించారు. వీటిని పరిశీలించి జర్నలిస్టు కుటుంబ సభ్యులకు రాయితీ కార్డులను అందజేస్తామని తెలిపారు. 400 మంది విలేకరులకు రాయితీ కార్డులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కరీం, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పోయిందని యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఉద్యోగం కోల్పోయిన ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. ఖమ్మం జిల్లా గోపవరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ (23) చింతల్ చంద్రానగర్ కాలనీలోని ఓ గదిలో నలుగురు స్నేహితులతో అద్దెకు ఉంటూ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నెల రోజుల క్రితం సదరు సంస్థలో పని చేసే కొంతమంది ఉద్యోగులను విధుల నుండి తొలగించారు. వారిలో పవన్‌కుమార్ కూడా ఉండటంతో సొంతూరుకు వెళ్లి పదిహేను రోజుల క్రితం తిరిగి చంద్రానగర్‌కు వచ్చాడు. అయితే మరో ఉద్యోగం దొరకకపోవడంతో బంధువులు సొంత ఊరుకు వెళ్లాలని సూచించారు. ఉద్యోగం దొరకకపోవడం అవమానంగా భావించిన పవన్‌కుమార్ మనస్తాపంతో శుక్రవారం అర్ధరాత్రి గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని శనివారం ఉదయం గమనించిన స్నేహితులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచమానా నిర్వహించి గాంధీ ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆవిర్భావం అనంతరం పదేళ్లలో పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందిందని ఆ శాఖ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి అన్నారు. శనివారం ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పదేళ్లలో తెలంగాణలో పర్యాటక అభివృద్ధి-మేనేజ్‌మెంట్ దృక్కోణం అనే అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు అధ్యక్షత వహించగా అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్రంలో అభివృద్ధి చెందిన వివిధ పర్యాటక ప్రాంతాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొ.నరేష్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు 'ఐఎస్‌బీ'లో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఆదివారం నూతన పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది. కేమ్కా ఆడిటోరియంలో సాయంత్రం 4.30 గంటలకు హరప్పా ఎడ్యుకేషన్ చైర్మన్, ఐఎస్‌బీ వ్యవస్థాపక డీన్ డాక్టర్ ప్రమత్‌రాజ్‌సిన్హా 'లెర్న్, డోన్ట్ స్టడీ' పేరిట రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్‌పిల్లుట్లతో డాక్టర్ సిన్హా ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది.

నూతన కార్యవర్గం

రాయదుర్గం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు .అధ్యక్షుడిగా సీకే మహ్మద్ షరీఫ్, ఉపాధ్యక్షులుగా రేష్మాసమల్,అంజన్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్ రచనారెడ్డి, అజయ్‌కుమార్, కార్యదర్శులుగా షైన్‌మారియా, బాసిల్ జార్జ్, మహ్మద్ ఫయాజుల్‌హక్,ముకుంద్‌కుమార్, శాశ్వత ఆహ్వానితులుగా అమల్ జోన్‌ఫిలిప్, సీఎం సునీల్‌కుమార్, చాణక్య, సయూజ్‌అబ్రహం, కోశాధికారిగా సంగీత్‌ఆర్‌నాయర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్‌గా జర్నాపాధ్యాయ్, మహ్మద్‌నద్రన్, కార్యవర్గ సభ్యులుగా కెబిశ్రీరామ్, ఖాలీద్,శ్యాంసన్ గిడ్లా, దావిస్‌జేఅల్బ్రత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సీకేమహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

నేడు 'మంచినీళ్ల పండగ'

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం 'మంచినీళ్ల పండగ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఉదయం 10 గంటలకు మియాపూర్ డివిజన్‌లోని జేపీఎన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జేపీఎన్‌నగర్‌లో..

మియాపూర్: డివిజన్ పరిధిలోని జేపీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు.


ఫ్లెక్సీకి పాలాభిషేకం


క్రేన్ సహాయంతో శ్రీశైలంగౌడ్‌కు భారీ గజమాలను వేస్తున్న దృశ్యం

శ్రీశైలంగౌడ్‌కు పలువురి జన్మదిన శుభాకాంక్షలు


జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, బీజేపీ నాయకులు



మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి బీజేపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడిగా మారింది. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్‌ను గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. – కుత్బుల్లాపూర్

డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిష్కరించండి


షాపూర్‌నగర్ - గాజులరామారం ప్రధాన రోడ్డు సంజయ్ గాంధీ నగర్ వద్ద రోడ్డుపై మురికినీరు

సుభాష్‌నగర్: రద్దీగా ఉండే రోడ్లలో డ్రైనేజీ లీకేజీ ఏర్పడితే రాకపోకలకు ఇబ్బంది కలగకుండా గంటల వ్యవధిలో సమస్యను పరిష్కరించాలి. కానీ సంబంధిత అధికారులు ఆ దిశగా పనులు చేయడం లేదనడానికి ఈ చిత్రాన్ని నిదర్శనంగా తీసుకోవచ్చు. షాపూర్‌నగర్ నుండి గాజులరామారం వెళ్లే ప్రధాన రోడ్డులో సంజయ్ గాంధీనగర్ వద్ద గురువారం ఉదయం డ్రైనేజీ చిన్నగా లీకేజీ అయింది. కాస్త ఇంత పెద్ద గొయ్యిగా మారి రోడ్డు కుంగిపోయింది. ప్రధాన రోడ్డులో డ్రైనేజీ నీరు చేరి మురికిగుంటలా మారింది. ప్రధాన రోడ్డులో ఇంత సమస్య ఉన్నా సంబంధిత అధికారులు అటువైపు రాలేకపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

హ్యాండ్ రైటింగ్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో శనివారం టీవీఆర్ గ్రూప్ స్కూల్స్ ఉపాధ్యాయులకు హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. హ్యాండ్‌రైటింగ్ శిక్షకులు, లక్కీస్ హ్యాండ్‌రైటింగ్ అకాడమీ డైరెక్టర్ దేవి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ట్రైనింగ్ శిబిరం కొనసాగింది. పాఠశాల ఎండి వంశీకృష్ణారెడ్డి ,టీవీఆర్ గ్రూప్ చైర్మన్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సేవాలాల్ నగర్‌లో అన్ని మౌలిక వసతులు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో రాష్ట్ర గిరిజన ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బడుగు బలహీన వర్గాల కోసం సేవాలాల్ ఎంతో కృషి చేశారని, బాలాజీనగర్ డివిజన్‌లో సేవాలాల్‌నగర్ వాసులకు తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో డీసీ రవికుమార్, సేవాలాల్ నగర్ వాసులు శంకర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం


కూకట్‌పల్లిలోని అశోక్‌వన్ మాల్‌లో హనీ హనీ స్టోర్‌ను శనివారం ప్రారంభిస్తున్న సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా దంపతులు, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కుమారుడు మహమ్మద్ అసదుద్దీన్ - కూకట్‌పల్లి

మంచినీటి పండగను విజయవంతం చేయండి

- ఇంటింటికీ నీటి సరఫరాపై ప్రచారం చేయాలి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం సూచించిన మేరకు ఈనెల 18న (ఆదివారం) మంచినీటి పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. మంచినీటి పండగ సందర్భంగా డబుల్‌పూరాలో నిర్వహించనున్న కార్యక్రమాల్లో రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పాత్రికేయులతోసహా వివిధ వర్గాల ప్రజలు మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల నుంచి మొదలుకొని పట్టణాల్లో ఇంటింటికీ నల్లాల ద్వారా మంచి నీరు సరఫరా జరుగుతున్న తీరును మంచినీటి పండుగ రోజున ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నీటి కోసం ఎలాంటి ఇబ్బందులు లేని విషయాన్ని తెలపాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి ఉచితంగా నల్లాలు బిగించి స్వచ్ఛమైన, సురక్షితమైన నీటిని అందిస్తున్న తీరును ఈ సందర్భంగా నిర్వహించే సభల్లో వివరించాలన్నారు. ఇందులో సెర్ప్ ఉద్యోగులందరినీ భాగస్వాములను చేయాలని ఆదేశించారు.